707) సామంతం/కానడ

ప॥ ఆ రూపమునకే హరి నేను మొక్కెదను। చేరి విభీషణుని శరణాగతుడని చేకొని సరిగాచితివి॥

చ॥ ఫాలలోచనుడు బ్రహ్మయు నింద్రుడు। సోలి నగ్నియును సూర్యచంద్రులును।
నీలో నుండగ నెరి గనె కిరీటి। మూల భూతివగు మూర్తివి గాన॥

చ॥ అనంత శిరసుల ననంతపదముల। ననంతనయనము లనంతకరముల।
ఘన నీరూపము కనుగొనె కిరీటి। అనంతమూరితి వన్నిట గాన॥

చ॥ జగములిన్నియును సకల మునీంద్రులు। నగు శ్రీవేంకటనాథుడ నిన్నే।
పొగడగ కిరీటి పొడగనె నీరూపు। అగణిత మహిముడ వన్నిట గాన॥